క్లుప్తంగా

ఉత్తమ్‌కు పరామర్శ



నివాళులర్పిస్తున్న సమాచార హక్కు వికాస సమితి సభ్యులు

నాగారం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర, జిల్లా సభ్యులు శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పరామర్శించారు. అనంతరం పురుషోత్తమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర వ్యవస్థక అధ్యక్షుడు ఎరమాద కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఉన్నం సత్యనారాయణరావు, నాగారం బంగ్లాకు చెందిన సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శివ, దండ వెంకట్‌రెడ్డి, ఏసుపాదం, శ్రీధర్ ఉన్నారు.

ఆదేశాలు బేఖాతరు

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవుల్లో పాఠశాలలు నిర్వహించవద్దని ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇవేమీ తమకు పట్టవన్నట్లు తుంగతుర్తిలోని ఓ పాఠశాల యాజమాన్యం పాఠశాలను నిర్వహిస్తోంది. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చివ్వెంల : ఆశ్వయుజ మాస స్వాతి నక్షత్రం సందర్భంగా ఉండ్రుగొండ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వారి కల్యాణ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ అరవిందచార్యులు, క్రిష్ణమా చార్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణం జరిపించారు.

గాయపర్చిన వ్యక్తులపై కేసు

ఆత్మకూర్(ఎస్) : పాత కక్షలు దృష్టిలో ఉంచుకొని వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన వారిపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రత్నావత్ శంకర్‌నాయక్ తెలిపారు. ఏనుబాముల గ్రామానికి చెందిన కలకోట్ల మురళి ఇటీవల వర్షాలకు తన పొలం వద్ద నీళ్ల అధికమొత్తంలో నిలవడంతో బయటికి వెళ్లేందుకు జేసీబీతో గాతు పెట్టించాడు. అయితే శనివారం అతడి పక్కపొలాలకు చెందిన రైతులు కలకోట్ల శ్రీను, సతీష్‌లు గాతు ఎందుకు పెట్టావని మురళితో ఘర్షణపడి రాయితో గాయపరిచారు. బాధితుడు మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రత్నావత్ శంకర్ నాయక్ తెలిపారు.

తిమ్మాపురం-సంగెం రోడ్డుకు మోక్షం

- పూర్తయిన టెండరు ప్రక్రియ
- రూ.32 కోట్లతో రోడ్డు విస్తరణ
- త్వరలో ప్రారంభం కానున్న పనులు



తిమ్మాపురం-సంగెం రహదారిపై కోడూరు వద్ద వాగులో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు (ఫైల్)

అర్వపల్లి : మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగించే తిమ్మాపురం-సంగెం రహదారి విస్తరణకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం నుంచి తుంగతుర్తి మండలం సంగెం మీదుగా నూతన్‌కల్ వరకు రోడ్డును విస్తరించనున్నారు. ఈ రోడ్డు విస్తరణకు కొన్ని నెలల కిందట రూ.32 కోట్లు జీఆర్‌సీ ద్వారా మంజూరయ్యాయి. అయితే ఇటీవల ఎన్నికల కారణంగా టెండర్ ప్రక్రియలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు టెండరు ప్రక్రియను పూర్తిచేశారు. పనుల ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

22 కి.మీ రహదారి విస్తరణ..

జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని 365 జాతీయ రహదారి నుంచి కోమటిపల్లి, కొమ్మాల, కోడూరు, సంగెం, ఎల్కపల్లి మీదుగా నూతన్‌కల్ వరకు మూడు మండలాల పరిధిలోని 22 కి.మీ దూరం గల రహదారిని విస్తరించనున్నారు. అలాగే సంగెం, కోడూరు తదితర ప్రాంతాలలో మూడు బ్రిడ్జీలు, ఒక రోడ్డు డ్యాం నిర్మించనున్నారు. ఈ రోడ్డు ప్రస్తుతం 24 ఫీట్ల వెడల్పు ఉండగా 30 ఫీట్లకు పెంచనున్నారు.



అధ్వానంగా మారిన కోడూరు రోడ్డు



కోమటిపల్లి వద్ద రోడ్డు దుస్థితి

రహదారి సమస్యకు పరిష్కారం..

ప్రస్తుతం ఈ రోడ్డుపై బ్రిడ్జీలు లేక వర్షాలు పడితే వాగులు పొంగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే కొన్ని గ్రామాలు జల దిగ్బంధంలో మునుగుతున్నాయి. రహదారి విస్తరణ జరిగి బ్రిడ్జీల నిర్మాణం జరిగితే మూడు మండలాలకు చెందిన వాహనదారులు, ప్రజల కష్టాలు శాశ్వతంగా తీరనున్నాయి. త్వరలోనే పలువురు మంత్రులచే రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించడానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డు విస్తరిస్తే కష్టాలు తీరుతాయి



తిమ్మాపురం-సంగెం రహదారి విస్తరణ, బ్రిడ్జీల నిర్మాణం జరిగితే ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఎన్నో ఏళ్లగా ఈ పనులు చేపట్టుటకు పోరాడుతున్నాం. త్వరలోనే మంత్రులతో పనుల ప్రారంభోత్సవం జరుగుతుంది.

– సామ అభిషేక్‌రెడ్డి, కోడూరు

టెండరు పూర్తయింది



తిమ్మాపురం-సంగెం రహదారి విస్తరణ, బ్రిడ్జీల నిర్మాణం కోసం రూ.32 కోట్లు మంజూరు కాగా టెండరు ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియ జరుగుతుంది. త్వరలో ఈ రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి.

– బాబూరావు, పీఆర్ డీఈ

కాంగ్రెస్ పార్టీ సీనియర్లను విస్మరించడం తగదు

- జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి



మాట్లాడుతున్న యోగానందచారి

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్లను ఎమ్మెల్యే సామేల్ విస్మరించడం తగదని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అన్నారు. అర్వపల్లిలో శనివారం నిర్వహించ తలపెట్టిన కాంగ్రెస్ సీనియర్ నాయకుల సమావేశాన్ని పోలీసులు అడ్డుకుని, అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే గెలుపుకోసం కృషిచేసిన సీనియర్ నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని ప్రోత్సహిస్తూ పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడి పనిచేసిన వారిని గుర్తించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై త్వరలో హైదరాబాద్‌కు వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలువనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ, మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, నారగోని అంజయ్యగౌడ్, గూడెపు నాగరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పనిచేసిన కార్యకర్తలకే పార్టీలో అవమానాలు

నూతనకల్ / అర్వపల్లి : అర్వపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించనున్న అసమ్మతి సమావేశాన్ని భగ్నం చేయడం కోసం పోలీసులు పలువురు నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ జాజిరెడ్డిగూడెం మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్‌లను అరెస్టు చేసి నూతనకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి కాంగ్రెస్ శ్రేణులతో అక్కడికి వెళ్లి ధర్నా నిర్వహించారు. దీంతో పోలీసులు కాంగ్రెస్ నాయకులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పన్నులు విరమించుకోవాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీ విలీన గ్రామాల్లో పెంచిన పన్నులను తక్షణమే విరమించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సూర్యాపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్‌కే గులాం హుస్సేన్, డివిజన్ నాయకుడు పిడమర్తి లింగయ్య మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సూర్యాపేట చుట్టూ ఉన్న 9 గ్రామాలను విలీనం చేశారని, కానీ అక్కడ అభివృద్ధి చేయడం మర్చిపోయారని తెలిపారు. ఆ గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ, కరెంట్, మున్సిపల్ వాటర్, రోడ్లు వంటి కనీస వసతులు లేవని తెలిపారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ డివిజన్ నాయకుడు పిడమర్తి లింగయ్య, ఎస్‌కే సయ్యద్, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రేణుక, కోశాధికారి జయమ్మ, పద్మ, మోహన్, శంకర్, ప్రసాద్, సైదులు, జయమ్మ, చిట్టి, రమేష్, జానయ్య, రజిత, శ్రీదేవి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భానుపురి : అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని నలంద కాలేజీ ఆవరణలో సీఐటీయూ జిల్లా విస్తృత సమావేశాన్ని రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దన్నారు. ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.వెంకటనారాయణ, యల్క సోమయ్య గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు మిట్టగడుపుల ముత్యాలు, రణపంగు కృష్ణ, సైదులు, బచ్చలకూర స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

భానుపురి : ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన 38 మంది కార్మికుల ఆశయ స్ఫూర్తితో కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. 2019లో 55 రోజుల ఆర్టీసీ సమ్మె సందర్భంగా అమరులైన కార్మికులను స్మరించుకుంటూ శనివారం డిపోలో 'ఆర్టీసీ రక్షణ కార్మికుల త్యాగాల దినోత్సవం' నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఎస్ఎస్ గౌడ్, బత్తుల సుధాకర్, లచ్చయ్య, ధోన్ వాన్ రవికుమార్, పీఎంరావు, ఘనీ, సేవ్యా, లక్ష్మయ్య, శ్రీకంట్లం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతికి ప్రతిరూపం బతుకమ్మ పండుగ



వేడుకల్లో పాల్గొన్న శ్రీలక్ష్మీ వెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థినులు, సిబ్బంది

సూర్యాపేటటౌన్ : ప్రకృతికి ప్రతి రూపం బతుకమ్మ పండుగ అని శ్రీలక్ష్మీవెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల చైర్మన్ కారింగుల విజయలక్ష్మి, కరస్పాండెంట్ కారింగుల బాల గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఎంతో ఆనందంతో సంప్రదాయ రీతిలో జరుపుకునే పండుగ బతుకమ్మ అన్నారు. అనంతరం బతుకమ్మలను చెరువులో వదిలారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇసుక విధానంపై అవగాహన

అర్వపల్లి : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'మన ఇసుక వాహనం' పథకానికి సంబంధించి ట్రాక్టర్ యజమానులు తమ ట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఇసుక విధానంపై ట్రాక్టర్ యజమానులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి పేర్లను క్రమసంఖ్య ప్రకారం రికార్డు చేయనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలను, రూ.20 వేల డీడీని కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ రామరాజు జలంధర్‌రావు, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఐద్వా సభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

భానుపురి(సూర్యాపేట): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సూర్యాపేట జిల్లా ఐద్వా మూడో జిల్లా మహాసభకు ఆమె ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. గృహలక్ష్మి పథకం కింద పేద మహిళలందరికీ నెలకు రూ.2,500 అందించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై మహిళలు పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేఎస్ ఆశాలత, మద్దెల జ్యోతి, సురబి లక్ష్మి, మేకనబోయిన సైదమ్మ, తంగెళ్ల వెంకటచంద్ర, జూలకంటి విజయలక్ష్మి, షేక్ ఖాజాబి, త్రివేణి, నారాయణమ్మ, దేవిరెడ్డి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య కిట్లు.. గీత కార్మికులకు శ్రీరామరక్ష



చివ్వెంల : శిక్షణలో పాల్గొన్న గీత కార్మికులు

చివ్వెంల : కాటమయ్య కిట్లు గీత కార్మికులకు శ్రీరామ రక్ష అని కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జెర్రిపోతుల క్రిష్ణయ్య అన్నారు. కాటమయ్య సెఫ్టీ కిట్ల వినియోగంపై అక్కలదేవిగూడెంలో గీతకార్మికులకు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో వేముకొండ పద్మ, కోటయ్య, పవన్, మడ్డి అంజిబాబు, ఉయ్యాల నగేష్, ఎక్సైజ్ సిబ్బంది, బీసీ వేల్ఫేర్ సిబ్బది తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రక్షణ కవచం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి మొగదాల లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో మండల గౌడ సంఘం సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు అనిల్ కుమార్, నర్మద, బీసీ వెల్ఫేర్ అధికారులు భుజంగరావు, రాంబాబు, బెల్లంకొండ శ్రీరాములు, మడ్డి అంజిబాబుగౌడ్, బోడ సైదులుగౌడ్, చామకూరి సైదులు, పొడిశెట్టి సైదులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో ప్రతిభ

సూర్యాపేట టౌన్ : ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ -14 బాలుర క్రికెట్ పోటీల్లో సూర్యాపేట జట్టు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. శనివారం సూర్యాపేటలోని ఎస్‌జీఎం క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో నల్లగొండ జట్టుపై సూర్యాపేట జట్టు విజయం సాధించింది. ఈ జట్టులో సూర్యాపేటకు చెందిన అఖిలేష్ యాదవ్, కుషిశ్వర్, కౌశిక్, హర్షిత్‌లు అద్భుతంగా ఆడి తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా క్రికెట్ కోచ్ శ్రీను ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

తిరుమలగిరి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాల సభ్యుల ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ వానాకాలం సీజన్‌లో దొడ్డు రకం, సన్న రకం కొనుగోలు కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏపీఎం సైదయ్య, ఏఈఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

చివ్వెంల : షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని మున్యానాయక్ తండాలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్యానాయక్ తండాకు చెందిన ధరావతు సురేష్ ఇంట్లో శనివారం షార్ట్ సర్క్యూట్ జరిగి వంట సామగ్రి, దుస్తులు, టీవీ, ఫ్రిజ్, కూలర్, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. దగ్ధమైన వస్తువుల విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు.

పేదల తరఫున పోరాడిన మహనీయుడు వెంకటస్వామి



భానుపురి : గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత



సూర్యాపేట : జిల్లా పోలీస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఏఎస్పీలు, సిబ్బంది



అర్వపల్లిలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది

భానుపురి : పేదల తరఫున కడవరకు పోరాడిన మహనీయుడు గడ్డం వెంకటస్వామి అని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శనివారం గడ్డం వెంకటస్వామి 95వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గుడిసెలలో నివసిస్తున్న పేదల తరఫున పోరాడి, వారికి ఇళ్లు నిర్మించే వరకు కృషి చేసి గుడిసెల వెంకటస్వామిగా పేరుపొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎండబ్ల్యూఓ నరసింహారావు, జిల్లా అధికారులు రాంచందర్ రావు, లత, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్ పద్మారావు, డీటీడీఓ శంకర్, టీఎన్‌జీఓ కార్యదర్శి శ్యామ్, నాయకులు దేవరశెట్టి సత్యనారాయణ, స్టాలిన్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

సూర్యాపేట : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి, డీఎస్పీ మట్టయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, సీఐ చరమంద రాజు, ఆర్ఐలు నారాయణ రాజు, నరసింహ పాల్గొన్నారు.

తిరుమలగిరి : మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని శనివారం తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మామిడి బుచ్చిబాబు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మాజీ ఎంపీ వెంకటస్వామిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తహసీల్దార్ లాలు అన్నారు. శనివారం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన వెంకటస్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సంజీవయ్య, ఆర్ఐ రంజిత్‌రెడ్డి, అజీజ్ ఉన్నిసా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలి

నూతనకల్ : వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత అన్నారు. శనివా రం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వెంకటస్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : మాజీ ఎంపీ, కార్మిక యోధుడు గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి వేడుకలను శనివారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ జలంధర్‌రావు, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : జీవితాంతం పేదల పక్షపాతిగా పనిచేసి గుడిసెల వెంకటస్వామిగా పేరుగాంచిన వెంకటస్వామి సేవలు మరువలేనివని ఎంపీడీఓ ఎండీ హసీం తెలిపారు. శనివారం వెంకటస్వామి జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటాచారి, ఎంపీఓ బీసు రాజేష్, ఏపీఓ ఈశ్వర్, హుస్సేన్, స్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

నాగారం : కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి వేడుకలను ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ధార శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రవి, సూపరింటెండెంట్ ముత్తయ్య, ఈసీ ముక్కంటి, టీఏ రాంనరేష్, జూనియర్ అసిస్టెంట్ అక్తర్, విజయలక్ష్మి, రాధిక, హైమావతి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అవతారంలో దుర్గామాత

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం దుర్గామాత అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. గ్రామాల్లోని మండపాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



సూర్యాపేట : 28వ వార్డులో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి



సూర్యాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



తుంగతుర్తి : గాజులగూడెంలో దుర్గామాత వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు



అర్వపల్లి : కొమురం భీమ్ యూత్ ఆధ్వర్యంలో..



తిరుమలగిరిలో పూజలు చేస్తున్న భక్తులు

సంక్షిప్త సమాచారం

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

సూర్యాపేట టౌన్ : పీహెచ్‌సీల్లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. అనంతరం జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా కేసులపై శ్రద్ధ చూపించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు

ఆత్మకూర్(ఎస్) : ఆడపిల్లలపై వివక్ష తగదని ఎంవీ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. ఆడపిల్లల సమానత్వ సమైక్య కమి టీలపై శనివారం మండల కేంద్రంలో కిశోర బాలికలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు ఆడ పిల్లల్ని మగ పిల్లలతో సమానంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ వత్సవాయి లలిత, ఆర్గనైజర్లు సైదులు, జయలలిత, మంజుల పాల్గొన్నారు.

లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి

నూతనకల్ : అక్రమ లేవుట్ల ప్లాట్లను యాజమాన్యులు క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు సమీపంలోని 77సర్వే నంబర్‌లో ప్లాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మహేందర్, ఆర్ఐ మహ్మద్ అసన్, పంచాయతీ కార్యదర్శి రవిశర్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం : అనుమతి లేని లేఅవుట్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం నాగారం, ఈటూరులోని ప్రగతినగర్, నాగారం బంగ్లా, పసునూర్ గ్రామాల్లో అనుమతిలేని లేఅవుట్ ప్లాట్లను పరిశీలించి మాట్లాడారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి మండలంలో మొత్తం 442 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. విచారణ సమయంలో దరఖాస్తుదారులు అందుబాటులో ఉండి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ నవీన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శోభన్ బాబు, దావుల సతీష్, నజీర్‌బాబా, రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్ మహేశ్వరి పాల్గొన్నారు.